

మమతల మూల్యం

జి. భాను

కూరగాయల సంచి ఇల్లాలి చేతికిచ్చి, గోడవారగా సైకిల్ ఉంచి, ఏదో బాధను ఉపశమింప జేసుకొన్నట్టుగా నిట్టూర్చాడు మార్కండేయరావు. భార్య శాంతమ్మ భర్త ముఖం ఓ క్షణం పరిశీలించి వంట గదిలోనికి దారితీసింది. వంకాయలు పుచ్చులనీ, బెండకాయలు ముదురనీ, దుంపలు పుచ్చులనీ భర్తమీదకు దండయాత్రకు ఇంకోసారి రావచ్చుగదా అనే ధీమాతో ఆమె నిష్క్రమించిన తర్వాత మార్కండేయరావు నెమ్మదిగా ఇంట్లోకి వచ్చి బల్లముందు కూర్చొని ప్రొద్దున నుంచీ చూడని పేపరు తిరగేస్తున్నాడు.

— రైలుబండి గూడ్సుబండితో ఢీ కొనగా తొమ్మిదిమంది దుర్మరణం!

— లారీ క్రిందపడి ఒక యువకుని చావు!

— హోటల్ వర్కర్ దారుణమైన హత్య!

— ప్రకాశం! నువ్వు మరణించినా, నీ ఆత్మ మాలోనే ఉంది. నీవు లేనిలోటు మా హృదయ మందిరాల్లో నిరంతరం నీడలా వెన్నాడుతోంది.

ఇట్లు
కుటుంబ సభ్యులు.

ఈ వార్తలు చదివి మార్కండేయరావు సాలోచనగా కన్నులు మూసుకొన్నాడు. 'అబ్బా! ఎక్కడ చూసినా చావు! చావు! చావు! ఏ వంక ఒదిగినా, ఏ దిక్కు నక్కినా బ్రదుకుతున్న బ్రతుకు, చావుకు సావాసమైపోతున్నది క్రీనీడలా! ఇది భగవంతుని చిద్విలాసం కాబోలు!' అని అంతర్ముఖుడయ్యాడు.

అంతలో — వంట గదిలోనుండి శాంతంగా విచ్చేసిన శాంతమ్మ సంధించిన ప్రశ్న సారించింది.

'వంకాయలు ఎంతకిచ్చారు?'

'ఏం... కిలో... రెండు రూపాయలు!'

'బెండకాయలో?'

'అవీ... అంతే ధర!'

'బంగాళాదుంపలు?'

'ముచ్చటగా మూడు రూపాయలు.'

'అమ్మో! ఎందుకంత ఖరీదు?'

'దొరుకుతున్నందుకు సంతోషించమంటున్నారు!'

'లేకపోతే ఛస్తామా?'

'ఛస్తే సమస్యలూ, ప్రశ్నలు ఉండవ్.'

ఒక్క క్షణం శాంతమ్మ మాట్లాడలేదు.

'సరేగాని... . అరడజను బత్తాయిపండ్లు ఎంతకు కొన్నారేమిటి?'

'బత్తాయిపండ్లు చూశావా? బాగున్నాయి గదూ! ఎక్కడివనుకొన్నావు? దోసకాయల వళ్లవి! పంచదారకన్నా తియ్యనంట! అరడజన్ రూపాయిన్నరే!' అని భార్య ముఖంలోని భావాల కోసం చూశాడు.

'అమ్మో!... ముష్టి ఆరు పండ్లు... ఆ వెధవ బత్తాయిలు రూపాయన్నరా? ఇంటికొచ్చి, కాళ్ళమీదే సైకిల్‌వాళ్ళు డజన్ రూపాయికే పారేసిపోతున్నారు గదండీ... సెలవు పెట్టి మీరు చేసిన నిర్వాకం ఇదన్నమాట! అందుకే మీకు బేరం ఏమీ చేతకాదని నెత్తీ నోరు బాదుకొంటూనే ఉన్నా. కూరగాయలు ఏదో అనుకొంటే బత్తాయిపండ్లకు డబ్బు తగలేశారు గదండీ...' శాంతమ్మ వాక్ ప్రవాహం అవిరళంగా సాగుతుంటే మార్కండేయరావు పెదవులమీద నవ్వుకొని, భార్యతో అన్నాడు —

'శాంతా! పిల్లలు బడికి వెళ్లారుగదూ! ఓ ఐదు నిముషాలు ఈ కుర్చీమీద కూర్చో. ఒక చిన్న కథ చెబుతా. బోరుకొట్టనులే. ప్లీజ్ కూర్చో.'

'బాబూ! మీ కథలు, గాథలు నాకొద్దు... నా కోసం బోల్డు పని కాచుకొని వుంది. అదుగో ముఖం అలా పెట్టేశారు... కూర్చుంటాలెండి... తొందరగా చెప్పండి' అని కూర్చున్నది.

◯ చూపుల జోలె చాపి... ◯

దైన్యం తప్ప
మరే ఆచ్ఛాదనా లేక
తాటిచెట్టులా నగ్నంగా
ఆమె — !

ఎవడి క్షణకాలం మెరుపుకో
ఎవడి నిర్బాధ్యతకో
ఉదాహరణగా
ఆమె — !!

మరో క్షణకాలంలో
తనకు చోటెక్కడోనని
శాశ్వతంగా
వెతకడానికెళ్ళబోయే
పసికందు నోట్లో
రక్తం కూడ రానివి కుడుపుతూ
ఆమె — !!!

ఏడంతస్తుల రెస్టారెంట్ ముందు
"ఈ దేశమంటే నువ్వు కాదు
నే"నని
సవాలు విసురుతున్నట్లు
ఆమె — !

'చూపుల జోలె' చాపి
ఈ దేశమిలా ఉన్నంతవరకు
అలానే శాశ్వతంగా
ఆమె — !!

— సుంకిరెడ్డి నారాయణరెడ్డి

మమతల మూల్యం

'శాంతా! అంత ఔచిత్యం తెలియదా నాకు. పైపెచ్చు నువ్వే బాధపడతావు ఈ విషయం ఇప్పుడు చెప్పకపోతే. అయినా ఇది పగలనే సంగతి తెలియదనుకొన్నావా ?'

'ఊఁ... తెలుసు ... ఇందుకే కాబోలు సెలవు పెట్టింది ?'

'అవును! ఈ కథ కోసమే సెలవు పెట్టానేమో! మరి చెప్పమంటావా ? వద్దా ?'

'సరే చెప్పండి' అన్నది అర్ధాంగి కూర్చొంటూ.

నేను బజారుకు బయలుదేరాను గదా! వెళ్తూ మధ్యదారిలో ఈశ్వరరావు ఇంటివైపు వెళ్ళాను. 'ఇంట్లో ఎవరూలేరు. కాలక్షేపంగా ఉంటుంది. నేనూ వస్తా పద' అన్నాడు. ఇద్దరం బయలుదేరాం. చిన్న మార్కెట్లో ధరల కన్నా పెద్ద మార్కెట్లో ధరలు కొంచెం తక్కువగా ఉంటాయికదా అనుకొంటూ దూరమైనా అక్కడికే బయలుదేరాం.

కూరగాయల మార్కెట్టుకు వెళ్ళే గల్లి ఇరుకుగా, ఏటవాలుగా ఉంటుంది. పల్లంలో కూరగాయల మార్కెట్టన్నమాట! ఆ ప్రదేశం ఎంత రద్దీగా ఉంటుందో మాటల్లో చెప్పలేం. మనిషి తగలకుండా నడవడం కష్టమే! లారీలు వస్తుంటవి, వెళ్తుంటవి ... ఒక ప్రక్క బత్తాయి బుట్టలతో సైకిళ్ళు ... ఇంకో ప్రక్క కూరగాయల రాసులు... మధ్య ఇటూ అటూ తిరుగుతున్న బేరగాళ్ళు ... వస్తూ పోతున్న మనుష్యులు ... నుంచున్న లారీలలో నుండి చింతపండు బుట్టలు ... ఉల్లిపాయల బస్తాలు, అరటి గెలలు దింపడానికి తొందర పడుతున్న కూలీలు ... అంతా జన సమ్మర్దం.

ఈ జనప్రవాహాన్ని ఈదుకొంటూ కూరగాయల మార్కెట్టులోనికి వచ్చిపడ్డాం. ఇద్దరం కూరగాయలు కొన్నాం. వస్తూ మార్కెట్లో ఎడమచేతివైపుగా ఉన్న కొబ్బరికాయల కొట్టువద్ద కాయలు అడిగితే 'ముదురుకాయ రూపాయిన్నర; లేతకాయ రూపాయి పావలా' అన్నాడు.

'ఇచ్చే ధర చెప్పు' అంటే 'చెప్పేది ఇచ్చేది ఒక్కటే, ఇష్టముంటే కొనండి లేకపోతే పొండి' అన్నాడు నిష్కర్షగా. అంతలో ఆ కొట్టుముందర కొబ్బరికాయల లారీ ఆగింది. లారీ వెనకా ముందూ ఒంటెద్దు బండ్లు. ఎటూ దారి లేక ఆ కొట్టు ముందే నిలబడవలసివచ్చింది.

ఆ కొట్టువాడు మాత్రం ఏమాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా 'ఏంటయ్యా కొట్టుకడ్డం... ఎల్లండెల్లండి... పొద్దున్నే బేరం చేశార' అన్నాడు విసుగ్గా. నాకు ఒళ్ళు మండిపోయింది.

'అయ్యా! మేము నిలబడ్డంకోసం రాలేదు. ఇదుగో లారీ అడ్డం... ముందూ వెనకా బళ్ళూ... ఎట్లా మేం వచ్చేది' అన్నాను.

'అది నాకు తెలవదు... నా కొట్టుముందు నుంచి మాత్రం వెళ్ళమంటున్నా. అంతే' అన్నాడా మూర్ఖుడు. అంటే ప్రాణం విలువ కొబ్బరికాయల ఖరీదుకన్నా తక్కువన్నమాట వాడి దృష్టిలో. తర్వాత ఏదో విధంగా తిప్పలుపడి, సైకిళ్ళతో అక్కడనుంచి బైటపడ్డాం. అప్పటికి కొంత జనం పలచబడింది.

ఇంతకుముందు జరిగిన సంగతి చెప్పడం మర్చిపోయాను. కూరగాయలకు వెళ్ళేముందర ఒక ముసలమ్మ దగ్గర బత్తాయిపండ్లు బేరం చేశాడు ఈశ్వరరావు. ఎవరిదగ్గరనుకొన్నావు ? ఒక ముసలమ్మ దగ్గర. ఆమెకు అరవై సంవత్సరాలకు పైనే ఉండొచ్చు. చిరుగుల చీర కట్టుకొన్నది. చేతిలో కర్ర. అయితే బేరంలో మొండికట్టె. ఆ ముసలమ్మలో ఎంతమాత్రం బేరం చేసే లక్షణాలు లేవు. చెప్పిన మాటకంటే పైసా తగ్గించే తత్వం లేదు. అంత వయస్సులో ఆ తాపత్రయం ఎందుకో అర్థంకాదు.

'డజను బత్తాయిలు ఎంత ?' అంటే —

'మూడు రూపాయలు' అన్నది.

'అంత ఖరీదా ముసలమ్మా' అంటే —

'ఆటె రకమే అంత. పనసదార (పంచదార) అక్కర్లేదు' అన్నది.

'సరేగాని ఇంకో మాట చెప్పు' అంటే —

'మీ డబ్బు మీ దగ్గరే ఉంది ... నా పండ్లు నా దగ్గరే ఉన్నాయి. ఇంకో మాటలేదు' అన్నది.

కాల్చినా కాలదురా ఈ ముసలమ్మ అనుకొంటూ మేము కూరగాయలు కొనుక్కొని వస్తూ, మళ్ళా ముసలమ్మ కూర్చున్న స్థలం దగ్గరకువచ్చాం. ముసలమ్మ ప్రక్కన చింతకాయలు అమ్మేవాళ్ళు, ములక్కాడలు అమ్మేవాళ్ళు కూర్చున్నారు.

అప్పుడు ఆ ముసలమ్మ దగ్గర అరడజను పండ్లు మాత్రం ఉన్నాయి.

'ముసలమ్మా! ఇప్పుడైనా బేరం చెప్పు. ఎంతకిస్తావ్ అరడజన్' అన్నాడు ఈశ్వరరావు.

'ఇన్నాకే చెప్పాగదా బాబూ! అరడజను అమ్మేశాను గందా! పనసదార అక్కర్లేదు ... సూసుకోండి ... దోసకాయల పల్లి కాయలు మరి' అన్నది.

అంతలో అక్కడున్న జనం పారోమంటూ చెల్లా చెదరయ్యారు. అందరూ ప్రక్క ప్రక్కలకు ఒదిగిపోయారు. పిచ్చి పట్టిన కుక్కలాగా లారీ భయ్యమని మోత చేస్తూ స్పీడుగా వచ్చేస్తున్నది! ఈశ్వరరావు సైకిల్ నడుముకు ఆనించుకొని ముసలమ్మతో బేరం చేస్తున్నాడు గదూ, లారీని చూసి సర్దుకొనే అవకాశం లేకపోయింది. లారీ వచ్చేసింది ఉప్పెనలా ... అప్పుడు ఆ ముసలమ్మ ... ఒక్కక్షణంలో ... కనురెప్పపాటులో 'అయ్యో! నా కొడకా! సచ్చిన లారీ వొచ్చే' అంటూ ఈశ్వరరావును పొత్తిళ్ళలో పసిపిల్లవాణ్ణి హత్తుకొన్నట్లుగా తన మీదకు లాక్కొన్నది. అతనితో పాటుగా సైకిల్ కూడా ముసలమ్మపై పడింది ...

లారీ తుపాకీ గుండులాగా దూసుకొనిపోయింది.

ఒక్కక్షణం ఆలస్యం అయితే, ముసలమ్మ అమ్మలాగాఆదుకోకపోతే సైకిల్‌తోపాటు ఈశ్వరరావు నుగ్గు నుగ్గు అయ్యేవాడు. ఈ లోకంలో వాడికి నూకలు చెల్లిపోయి ఉండేవి. వాడి పెళ్ళాం, పిల్లలు అనాథలైపోయేవాళ్ళు. తర్వాత ఏమనుకొంటే ఏముంది ? జనం వాడి అదృష్టాన్ని పొగిడారు. వాడి పెళ్ళాం పసుపుతాడు గట్టిదన్నారు. లారీ డ్రైవర్ని బండ బూతులు తిట్టారు. ముసలమ్మ చేసిన ఘనకార్యాన్ని మెచ్చుకొన్నారు. అప్పటికి పోలీసు బైటపడి దారి సరిగా చూసుకొని నడవాలి అని కర్తవ్యోపదేశం చేసి, ఆ లారీ కోసం వెళ్ళాడు.

ఈశ్వరరావు ముసలమ్మవైపు కృతజ్ఞతపూర్వకంగా చూశాడు. ఇంకోమాట లేకుండా జేబులో ఉన్న రూపాయిన్నర యిచ్చి ఆ పండ్లు తీసుకొన్నాడు. అమృత ఫలాల్లా వాటిని సంచిలో భద్రంగా వేసుకొన్నాడు.

కొంతదూరం వచ్చాక 'నీకు ఇంట్లో ఎవరూ లేరు గదా ప్రస్తుతం. నేను తీసుకొంటాలే' అని రూపాయిన్నర ఇచ్చి వాటిని పుచ్చుకొన్నాను. ఇప్పుడు చెప్పాలి నువ్వు! ఈశ్వరరావు చేసింది సబబుగా ఉందా ? ప్రాణం రక్షించినందుకు ప్రతిఫలం ఇవ్వకపోగా, రూపాయిన్నర మాత్రం ఇచ్చి చక్కారావడం సమంజసమేనంటావా ? ఆ క్షణపు అమూల్యమైన సహాయం ఖరీదు రూపాయిన్నరేనా ?

జాతర

జాతర జరుగుతున్నది
దేవుని పేరిట మనుషుల జాతర జరగుతున్నది
ఆలయంలో భక్తులు గంటలమీద
సంతకాలు చేస్తున్నారు
పూజారి గజాల చేతులను
గంటసేవు నిలబెడుతున్నాడు
గడియారం చేతులను ఊరకే వదులుతున్నాడు
గుడిలోని దృశ్యాలను చూసి
టెంకాయలు తలలు పగులగొట్టుకొని
తెల్లబోతున్నాయి
అగరొత్తులు ఏడుస్తున్నాయి
దేవుడు రాయైపోయాడు

ఆలయం బయట జాతరలో
కత్తెరల దొడల్కింద
జేబుల కుత్తుకలు తెగుతున్నాయి
జారే జాణల జరి పైటలతోపాటు
యువకుల గుండెలూ జారుతున్నాయి
తల్లుల కోసం పిల్లలు వెతుకుతున్నారు
బిడ్డల కోసం తండ్రులు వెతుకుతున్నారు
జారే మల్లెలు జారుతున్నాయి
నలిగే మల్లెలు నలుగుతున్నాయి
జాతర జరుగుతున్నది
నీతిని పాతర వేస్తున్నది

— కందాళై రాఘవాచార్య

మమతల మూల్యం

ఆ ముసలమ్మ లేకపోతే ... వాడి పెళ్లాం ... ముగ్గురు పిల్లలు ... ఇంకా బంధువులు...ఈపాటికి నెత్తి, నోరు బాదుకొంటూ ఉండేవాళ్ళే గదా! కాబట్టే నువ్వు ఏదోలే అనుకొన్న ఆ పండ్ల వెనక అంత కథ ఉంది! ఇప్పుడు చెప్పు. నువ్వేమంటావో— అన్నాడు మార్కండేయరావు నిట్టూర్చి.

'అమ్మ బాబోయ్! అంత పని జరిగిందా? నా గుండెలు కొట్టుకొన్నాయి కదండి ... ఆ పెద్ద మనిషి ముష్టి రూపాయిన్నర యిచ్చి టెంగు రంగామని రావడానికి సిగ్గు వేయలేదటండీ — ఆ ముసలమ్మకు ఎంతచేస్తే ఋణం తీరుతుంది? నిజంగా ఎంత ఘోరం జరిగిపోయింది ... మీరు మాత్రం ఆ ముసలమ్మను మార్కెట్టుకు వెళ్ళకండి బాబు' కన్నుల్లో నీళ్ళు తిరుగుతున్న శాంతమ్మ అన్నది.

'మరి ఇంతకు ముందు ఆ బత్తాయి పండ్లనే ముష్టి పండ్లన్నావు ... వెధవ పళ్ళన్నావు ... వాటి అసలు కథ విని వాటినే భూషిస్తున్నావ్; ప్రశంసిస్తున్నావ్ ... శాంతా! ఒకవేళ ఈశ్వరరావుకు జరిగింది ... నాకే జరిగితే ... నువ్వు ... ఏమైపోయే దానివో? ఇంకా ఏమనేదానివో!' అన్నాడు కన్నులలోకి చూస్తూ.

'ఏమిటి మీరంటున్నది? ఎందుకలా అంటున్నారు?' అన్నది శాంతమ్మ ఆదుర్దాగా.

'అవును శాంతా! ఈశ్వరరావు పాత్ర కేవలం కల్పన. ఈ సంఘటన జరిగింది నాకే! ఆ ముసలమ్మ నా ప్రాణ ప్రదాత ... నీ పసుపు కుంకుమలకు విధాత ... ఆ పళ్ళు వెలలేని అమృత ఫలాలు ...' మార్కండేయరావు గొంతు గద్గదికం అయ్యింది.

'అమ్మో! ఈరోజు ఎంత దారుణం జరిగింది!' అని మార్కండేయరావును గాఢంగా కౌగలించుకొన్నది వణికిపోతూ.

అసలైన విలువలు అర్థం చేసుకొని అమూల్యమైన వస్తువు దూరమైపోయేదన్న తపనతో కౌగలించుకొన్న ఆ కౌగిలిలో, ఇంతకు ముందు రక్షణ యిచ్చిన ముసలమ్మ వాత్సల్యపు కౌగిలింతలో అంతర్లీనమైన మూలతత్త్వం, ఆ క్షణంలో మార్కండేయరావుకు అవగతమైంది.



గవర్నమెంట్ సోప్ ఫ్యాక్టరీ, బెంగుళూరు వారి విశిష్ట ఉత్పత్తి మార్కెట్ చేయువారు ⓜ మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు. MCA-MSS-61-Tel